సాక్షి నిర్మల్

శనివారం । 25 । మార్చి । 2023



గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. ఉదయం సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారు వచ్చింది. 8లో▸



గరిష్టం/కనిష్టం
34.2 /23.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఒకటిరెండో చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

సరికొత్తగా సరస్వతీ ఆలయం



సరస్వతీ అమ్మవారు



భూమిపూజ చేసి నమూనా పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- బాసర గర్భాలయం పనులకు శ్రీకారం
- రూ.22 కోట్లతో నిర్మాణం
- భూమిపూజ చేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- త్వరలోనే బాలాలయం ఏర్పాటు


భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయం త్వరలో సరికొత్తగా నిర్మాణం కానుంది. ఈమేరకు ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. బాసర ఆలయ అర్చక బృందం, ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సరస్వతీ గర్భాలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. బాసర ఆలయాన్ని పూర్తిస్థాయిలో మార్చేందుకుగాను సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే రూ.8 కోట్ల వ్యయంతో ఆలయ ప్రాంగణంలోని విశ్రాంతి భవనాల ఆధునీకరణ, ఇతర పనులు చేపట్టారు. తాజాగా మరో రూ.22 కోట్లతో గర్భాలయ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కృష్ణశిలలతో అత్యద్భుతంగా గర్భాలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయ ఈవో విజయరామారావు దేవాదాయ శాఖ ముందు గర్భగుడి నమూనాలు ఉంచి మార్పులు చేర్పులపై వారి సలహాలు సూచనలతో పనులు చేపట్టనున్నారు.

టెండర్లు పిలవగానే..

బాసర గర్భగుడి పనులు ప్రారంభానికి భూమిపూజ పూర్తయింది. టెండర్లు పిలిచిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. నెలరోజులుగా బాసర ఆలయంపై సమీక్షలు, సమావేశాలు, నూతన నమూనాలు, మాస్టర్‌ప్లాన్, ఇలా అన్నింటిపై కసరత్తు పూర్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే ఆలయ పనులు ప్రారంభించాలని చూస్తున్నారు. ఇటీవలే బాసర వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ అమలు విషయమై ఆలయ అధికారులతో చర్చించారు. శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి సూచనలతో రూపుదిద్దుకున్న నూతన నిర్మాణ నమూనాను మరోమారు పరిశీలించారు. గర్భగుడి ప్రధానాలయం నిర్మాణ సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోబోయే చర్యలు, ప్రత్యామ్నాయ విషయాలపై చర్చించారు.

కృష్ణ శిలలతో నిర్మాణం...

దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి మార్గదర్శనంతో ప్రధానాలయం గర్భగుడిలో మార్పులు చేర్పులు జరుగనున్నాయి. ప్రస్తుతం సరస్వతీ అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ప్రతిమ కనిపించదు. రానున్న రోజుల్లో మహాలక్ష్మి అమ్మవారు కనిపించేలా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టనున్నారు. మహంకాళి అమ్మవారి ప్రతిమ వెనుక ప్రాకారం మండపం, ప్రాకారం లోపల శివాలయ పునః ప్రతిష్ఠ, దత్తాత్రేయ స్వామివారి స్థల మార్పిడి, నలుదిక్కులా రాజగోపురాలు నిర్మాణం, అనివేటి మండప విస్తరణ, ధ్వజస్తంభం ఏర్పాటు, ఆలయ ప్రాంగణంలోనే యాగశాల ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు.



ఆలయ పునర్నిర్మాణ నమూనా

బాలాలయంపై కసరత్తు..

బాసర అమ్మవారి ప్రధానాలయం పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు చేపట్టే సమయంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.150 టిక్కెట్ అక్షర శ్రీకార మండపాన్ని బాలాలయంగా ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ భావిస్తోంది. విశాలమైన ఈ మండపంలో ప్రధానాలయం గర్భగుడి పనులు పూర్తయ్యేవరకు సరస్వతీ అమ్మవారి దర్శనాలు, అక్షరాభ్యాస పూజలు ఇక్కడే జరిగేలా ఆలోచిస్తున్నారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తారు. ఆలోపే బాసర వచ్చే భక్తులు, అక్షరాభ్యాసాలు జరిగేందుకు వీలుగా ఈ మండపాన్ని మార్చాలని భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

మోడల్ వెదురు సాగును పరిశీలించిన కలెక్టర్



మోడల్ వెదురును పరిశీలిస్తున్న కలెక్టర్

ముథోల్: మండలంలోని ముద్గల్ శివారులో గల ప్రభుత్వ ఉద్యానవన శాఖ నర్సరీలో సాగు చేస్తున్న మోడల్ వెదురు సాగును కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో 20 ఎకరాల్లో సాగు చేస్తున్న మోడల్ వెదురు క్షేత్రం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రిబెడ్ బాంబుకి సంబంధిత ప్రాజెక్టు రిపోర్ట్‌ను తయారు చేసి పంపాలని ఉద్యనవన శాఖ అధికారి సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తుకారం, ఆర్ఐ అభిమన్యు ఉన్నారు.

డీపీఆర్వోపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ డీపీఆర్వో బాదం తిరుమల నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగం పొందార ని, వెంటనే ఆమెపై చర్య తీసుకోవాలని తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గతంలో సాక్ష్యాధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికీ చర్య తీసుకోలేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో డీపీఆర్వోను విధుల నుంచి తొలగించకపోతే ఉమ్మడి జిల్లా ఆదివాసుల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, గోడం గణేశ్, జిల్లా అధ్యక్షుడు పెందూర్ మాధవ్, గౌరవ అధ్యక్షుడు సాకీ లక్ష్మణ్, పుర్క బాపురావు, ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, ఉపాధ్యక్షులు కుంరా శ్యామ్‌రావు, కార్యదర్శి వెట్టి మనోజ్, గోవర్ధన్, సీతారాం, తుడుం దెబ్బ జిల్లా, డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.


సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

తానూరు: సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని భైంసా ఏఎస్పీ సుభాష్‌కాంతిలాల్‌పాటిల్ అన్నారు. తానూరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. గతంలో పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ముథోల్ సీఐ వినోద్, ఎస్సై విక్రమ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిరుద్యోగులకు మంత్రి క్షమాపణ చెప్పాలి



విద్యార్థులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ విషయమై ప్రశ్నపత్రాల లీకేజీ సర్వ సాధారణం అని మాట్లాడిన జిల్లా మంత్రి నిరుద్యోగులకు, విద్యార్థులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈద్గా చౌరస్తా వద్ద మంత్రి కాన్వాయ్‌ని శుక్రవారం అడ్డుకున్నారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కసారిగా ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు మంత్రి కాన్వాయ్‌లోకి చొచ్చుకురావడంతో పోలీసులు ఆందోళన చెందారు. వెంటనే అప్రమత్తమై ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యుడిని చేస్తూ మంత్రి కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వాలన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయినాథ్, దినేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఫైనల్ ఫలితాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో డీఈవో రవీందర్‌రెడ్డి ప్రీ ఫైనల్ గణితం సబ్జెక్టు ఫలితాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. విద్యార్థులకు గణితంపై ఇష్టం కల్పించి, విద్యార్థులను గణిత పరీక్షకు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను మండలాల వారీగా ఉపాధ్యాయుల నుంచి సేకరించారు. సలహాలు, సూచనలు అందించారు. ప్రీ ఫైనల్ 2 గణిత పరీక్షలో సీ గ్రేడ్ సాధించిన విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలన్నారు. పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి, ఎంఈవో శంకర్ , గణిత ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌వర్మ, పెంట అశోక్, హరిప్రసాద్, కపిల్ గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కేంద్రం కక్షసాధింపు చర్య’

నిర్మల్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే రాహుల్‌గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక మోదీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజుగా అభివర్ణించారు. రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణ చూసి ప్రధాని భయపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా న్యాయమే గెలుస్తుందన్నారు. దేశమంతా రాహుల్ వైపే చూస్తోందని పేర్కొన్నారు. మోదీ చేసే కుట్రలకు కాంగ్రెస్ నాయకత్వం భయపడదని, చట్టపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

- కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే
- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ ఎమ్మెల్యే రేఖానాయక్
- కార్యకర్తల్లో జోష్ నింపిన దిలావర్‌పూర్, దస్తురాబాద్ ఆత్మీయ సమ్మేళనాలు

దిలావర్‌పూర్/దస్తురాబాద్: దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రభుత్వంపై ప్రజలు చూపుతున్న అభిమానం , కార్యకర్తల అండే బీఆర్‌ఎస్ పార్టీకి కొండంత బలమని రాష్ట్ర దేవాదాయ, అటవీ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. దిలావర్‌పూర్, దస్తురాబాద్‌లో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన ఆత్మీ య సమ్మేళనాల్లో పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి అక్కడే పలువురితో మాట్లాడారు. సమ్మేళన ప్రాంగణంలో పాకాల పౌండేషన్ వ్యవస్థాపకుడు రాంచందర్ ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. దిలావర్‌పూర్‌లో మంత్రి ఐకేరెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. అర్హులందరికీ పెన్షన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా, రైతుల పండించిన ప్రతీ పంటను కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర సర్కారు ప్రత్యేక కా ర్యక్రమాలను చేపట్టిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పది వేల ఎకరాల బీడుభూములు సాగులోకి రానున్నాయన్నారు. నియోజకవర్గంలో పునరుద్ధరణకు నోచుకోని ఎత్తిపోతల పథకాల మరమ్మత్తుల గురించి ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించామనీ, వాటికీ నిధులు సమకూర్చి పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల రాష్ట్ర బీజేపీ నాయకత్వం లేనిపోని ఆరోపనలతో కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. విపక్షాల కుట్రలను తిప్పి కొట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా బన్సపల్లి గ్రామానికి చెందిన పదిమంది కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. దిలావర్‌పూర్ ఎంపీపీ పాల్దె అక్షర ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో సన్మానించారు. దస్తురాబాద్‌లో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగానే బీఆర్‌ఎస్ జాతీయపార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండి రాష్ట్రంలో పార్టీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈమేరకు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమాల్లో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, ఏఎంసీ చైర్మన్ రమణ, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, దస్తురాబాద్ ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ శారద, సర్పంచ్ రాజమణి, వైస్ ఎంపీపీ రాజునాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య, రైతుబంధు సమన్వయ్య సమితి మండల అధ్యక్షుడు సంతోష్, ఆత్మ వైస్ చైర్మన్ రాజు, సర్పంచులు ప్రభాకర్, భూమేశ్, శంకర్, అంజన్న, పోసవ్వ, నాయకలు రమేశ్‌రావు, శ్రీనివాస్, సత్యం, శివ్వయ్య, రాములు, అజయ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్, మధుసూదన్, జిల్లా అధికారులు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, 58, 59, 76, 118 జీవోల ప్రకారం క్రమబద్ధీకరణ, పోడుభూములు, తెలంగాణకు హరితహారం, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటర్, పదవ తరగతి పరీక్షలు, ఐడీవోసీపై కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

- కంటి వెలుగు అంశంపై సీఎస్ సమీక్షిస్తూ జిల్లాలకు 5 లక్షలకు పైగా ప్రిస్క్రిప్షన్ అద్దాలు చేరాయన్నారు. వాటిని త్వరగా లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఆరోగ్య మహిళ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రిఫరల్ ఆసుపత్రిలో అవసరమైన వసతులు కల్పిస్తున్నామని, మహిళలకు పూర్తి చికిత్స ప్రాధాన్యతతో ఉచితంగా అందిస్తామన్నారు.
- భూముల క్రమబద్ధీకరణ అంశానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన 58, 59, 76, 118 జీవోలకు సంబంధించి పురోగతిపై సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. జీవో 58 సంబంధించి పెండింగ్ పట్టాలను మార్చి చివరి నాటికి పంపిణీ చేయాలన్నారు. జీవో 59కు సంబంధించి క్రమబద్ధీకరణ రుసుము వసూలు చేసి పట్టాలు పంపిణీ చేయాలన్నారు. జీవో 76కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుసుం వసూలు చేసి పట్టాల పంపిణీ చేయాలన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.
- రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో వైకుంఠధామం నిర్మించామని, వాటిని వినియోగంలోకి తీసుకోని రావాలని శాంతికుమారి సూచించారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పన పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బృహత్ పల్లె ప్రకృతి వనాల, పల్లె ప్రకృతి వనాల లక్ష్యాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేసవిలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు.

‘డబుల్’ పంపిణీకి సిద్ధం కావాలి...

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి రాష్ట్ర వ్యాప్తంగా 22,322 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని సీఎస్ తెలిపారు. మరో 9,411 మంది లబ్ధిదారులను ఏప్రిల్ మొదటి వారంలోగా ఎంపిక చేయాలని ఆదేశించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి..

అగ్ని ప్రమాదాల నియంత్రణకు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు జిల్లాలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచించారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి...

ఏప్రిల్ 3 నుంచి 13 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కాంపోజిట్ సైన్స్ పరీక్ష మాత్రం 9.30 నుంచి 12.50 వరకు ఉంటుందని తెలిపారు.

‘కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం’

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం, నరేంద్రమోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. దేశంలో 15 మంది అధిక సంపన్నులు ఉన్నారని, అదాని, అంబానీ లాంటివారిపై బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం విధానాలను ప్రశ్నించే వారిపైనే దర్యాప్తు సంస్థలు దాడిచేస్తున్నాయని ఆరోపించారు. దాడుల అనంతరం కాషాయ కండువా కప్పుకోగానే కేసులు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాకముందు అంతర్జాతీయంగా ముడి చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం అది 70 డాలర్లకు చేరిందన్నారు. అలాంటప్పుడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలే తప్ప, పెంచడం ఏమిటని ప్రశ్నించారు. నిత్యావసర ధరలు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు కార్పొరేట్లకు 10 శాతం రాయితీలు ఇస్తూ పన్ను రద్దు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మతోన్మాద, మనువాద రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని చెప్పి, ప్రస్తుతం ఆ ఊసే లేదన్నారు. గిరిజన యూనివర్సిటీ ఇస్తామని చెప్పి ఇప్పటికీ ప్రకటించలేదన్నారు. రాంజీ గొండ్ ఉద్యమ స్ఫూర్తికి నిలయమైన నిర్మల్ జిల్లాలో కనీసం రాంజీ గొండ్ స్మారక మ్యూజియం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. నిర్మల్ పోలీసులు బహిరంగ సభను అడ్డుకుని మైక్ కట్ చేసి దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండించారు. ఈ సభలో భైంసాలో జరిగిన మతపరమైన అల్లర్లు, దీనికి కారణమైన బీజేపీ, ఎంఐఎం గురించి మాట్లాడే సమయంలో పోలీసులు అడ్డుకోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీజేపీకి, బండి సంజయ్‌కి పోలీసులు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సభను అడ్డుకున్న పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, జగదీశ్, ఆడివయ్య, సైకిలాబ్ బాబు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, అరవింద్, శంభు తదితరులు పాల్గొన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి




వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జీవో 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ అన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రాజుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. సాగర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు జీతాలు సకాలంలో అందకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. పారిశుధ్య కార్మికుల్లో ఎక్కువమంది ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఆర్థికంగా బాగా వెనుకబడిన వారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. జీవో 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.16,500, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలన్నారు. యాక్ట్ టు బై 94ను రద్దుచేసి పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించి ప్రభుత్వ గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5.50 లక్షల ఆర్థికసాయం చేయాలని విన్నవించారు. దళితబంధు పథకంలో పంచాయతీ సిబ్బందికి ప్రాధన్యం ఇవ్వాలన్నారు. దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉంగరాల రాజు , కల్లేపల్లి చంద్రశేఖర్, బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తతే అసలు మందు

- ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ సాధ్యమే
- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: క్షయ నివారణకు అప్రమత్తతే అసలు మందు అని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ నిర్మల్‌ను క్షయ రహిత జిల్లాగా మార్చడానికి అందరూ అంకితభావంతో పని చేయాలన్నారు. అధిక ప్రమాదం ఉన్న వారిని గుర్తించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని తద్వారా వ్యాధిని వెంటనే గుర్తించి చికిత్స అందించడం సులభతరం అవుతుందన్నారు. క్షయతో బాధపడుతున్న వారు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని, ఇందుకోసం వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ప్రభుత్వం రూ.500 ఇస్తుందని తెలిపారు. క్షయ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని పేర్కొన్నారు. పూర్తి చికిత్స ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉందన్నారు. క్షయ నియంత్రణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం క్షయ నివారణలో, చికిత్స అందించడంలో, అవగాహన కల్పించడంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో క్షయ వ్యాధి కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎన్సీడీ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, విస్తరణ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, క్షయ వ్యాధి చికిత్స పర్యవేక్షకులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతర క్షయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందు ప్రణాళికే... సాగుకు మందు



నెన్నెలలో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15.50 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వేసవి దుక్కులతో ఎంతోమేలు
- భూసార పరీక్షలు చేయించడం కీలకం
- అధిక ఎరువులతో అనర్థాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు మరో రెండు నెలల్లో ప్రారంభం కానుంది. మే మూడో వారం నుంచే రైతులు దుక్కి దున్నడం, చేన్లు చదును చేయడం, గతేదాది పంట మొదళ్లు ఏరి కాల్చడం, తదితర పనులు మొదలుపెడుతారు. జూన్‌లో వర్షాలు మొదలవ్వగానే పంట రుణాలు, విత్తనాలు సమకూర్చుకోవడంతో సాగు పనులకు శ్రీకారం చుడుతారు. కానీ రైతులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సాగుకు సిద్ధమైతే మంచి దిగుబడులు సాధించేందుకు దోహదపడ నుందని వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్ చెబుతున్నారు. పంట సాగుకు ముందు తీసుకోవాల్సిన పలు సూచనలు ఆయన మాటల్లోనే..

భూసార పరీక్షలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 15.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుకు అధికారులు అంచనా వేశారు. అయితే పంట సాగుకు ముందు భూసార పరీక్షలు అవసరం. భూసార విలువలను తెలుసుకుని కాలానుగుణంగా సాగు తీరును మార్చుకోవాలి. పరీక్షల ద్వారా భూమిలో సూక్ష్మస్థూల పోషకాల లోపాలు, మోతాదు పద్ధతిలో ఎరువుల వాడకంతో అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలుంది. పొటాష్ వాడకాన్ని రైతులు కచ్చితంగా అలవర్చుకోవాలి. ఆధునిక యంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటించడంతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.

ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి...

పంట సాగుకు ముందు నుంచే ఖర్చులను లెక్కించుకోవాలి. పెట్టుబడులకు అనుగుణంగా విత్తనాలకు, కూలీలకు, ఎరువుల కొనుగోలుకు వ్యయాన్ని సమకూర్చుకోవాలి. బ్యాంకు రుణాలు పొందడానికి రైతులు ముందుగానే భూపత్రాలకు సంబంధించి పహాణి పత్రాలను సిద్ధం చేసుకోవాలి. బ్యాంకర్లు రెండు రకాలుగా నీటిపారుదల కింద ఎకర పత్తికి రూ.40 నుంచి 45వేలు అందించనున్నారు. వర్షాధారం ద్వారా సాగయ్యే పత్తి, వరి రూ. 35 నుంచి 45 వేల వరకు అందజేస్తారు.

పత్తి మెదళ్లను భూమిలో కలిపివేయడం..

పత్తి పంట దిగుబడి అనంతరం పత్తి చెట్ల మెదళ్లను కోసి కుప్పగా చేసి తగలబెడుతుంటారు. అలా కాకుండా రోటవేటర్ సాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు కలియదున్నాలి. రోటవేటర్ తర్వాత మల్ట్ చెల్డ్ నాగలితో దున్నాలి. తర్వాత మరో సారి రోటవేటర్‌తో కలియదున్నాలి. ఈ విధంగా చే యడంతో భూమి సారవంతం పెరగడమే కాకుండా పత్తి పంటకు కావాల్సిన ఎరువులు తగ్గించుకోవచ్చు.

వేసవి దుక్కులు కీలకం...

వానాకాలం సాగుకు ముందు నుంచే చేనును చదును చేసుకుని వేసవి తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. తదితర పంటల కోతల తర్వాత భూమిని వృధాగా వదిలి వేయకుండా వేసవిలో దుక్కి దున్నినట్లయితే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. లోతుగా దున్నడంతో వరుసకు వరుస మధ్యలో వర్షపు నీరు నిలిచి లోపాలికి చేరుతుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తరువాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, చెరువు మట్టిని పొలంలో వేదజల్లుకుంటే పంట దిగుబడికి సామర్థ్యం పెరుగుతుంది.

నాణ్యమైన విత్తనాలు..

పంట సాగులో ప్రధానమైంది విత్తనాల ఎంపిక. పత్తిలో బీటీ విత్తనాలు దాదాపు 34 సంస్థలు వందల రకాలను మార్కెట్లో సిద్ధంగా ఉంచుతున్నాయి. పత్తి ప్యాకెట్ 450 గ్రాముల ధర రూ.960 తీసుకుంటున్నారు. ఆయా కంపెనీల డీలర్ల ద్వారా రైతులను ఆకట్టుకునే విధంగా ప్రచారం చేస్తున్నాయి. ఇందులో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలు అందిస్తుందనే విషయంలో రైతులకు సరైన అవగాహన లేకుండా పోతోంది. దీంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే రసాయనాల వాడకం అవసరం మేరకే వాడాలి.

సాలుకు అడ్డంగా దున్నడం..

సాలుకు అడ్డంగా సేద్యం చేస్తే నీటి సంరక్షణ పెరుగుతుంది. విత్తనం వేయడం, అంతరకృషి చేయడంతో వర్షపు నీరు వాలుగ ఉన్న వైపు పరిగెత్తే అవకాశం ఉండదు. నీటి వేగం తగ్గి భూమిలోకి ఇంకడానికి అవకాశం కలుగుతుంది. ఎక్కువ నీరు భూమిలోనికి ఇంకడం వలన భూమిలో నిలువ పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులు..

సేంద్రియ ఎరువులు నేలలో కుళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసమైన స్థూల, సూక్ష్మపోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువను, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. సేంద్రియ ఎరువుల్లో పశువుల, కోళ్ల, గొర్రెల, వానాపాముల ఎరువును ఎకరానికి సుమారుగా 2- 4 టన్నుల వరకు వాడుకోవచ్చు. ఈ సేంద్రియ ఎరువులను విత్తడానికి 20–25 రోజుల ముందు వేసి భూమిలో కలియదున్నాలి. దీంతో భూమి గట్టి పడకుండా గుల్లగా ఉంటుంది.

క్లుప్తంగా

తిర్పెల్లిలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీలో శుక్రవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.కాలనీలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలోని ఖాళీ స్థలంలో పోగు చేసిన చెత్త కుప్పలకు ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఈ విషయమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కొద్ది దూరంలో స్క్రాప్, గ్యాస్ గోదాములు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

గుడుంబా పట్టివేత

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో గుడుంబా విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 13లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. గుడుంబాను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, ముత్యం, గౌతం, భాస్కర్, ఇర్ఫాన్, కల్పన ఉన్నారు.

స్మాష్ రాకెట్ చాంపియన్ షిప్‌లో కడెం యువకుడి ప్రతిభ



టీం సభ్యులతో మర్రిపెల్లి వెంకటేశ్

కడెం: ఈ నెల 15 నుంచి 17 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించిన స్మాష్ రాకెట్ చాంపియన్ షిప్‌లో కడెం మండలంలోని నవబ్‌పేట్ గ్రామానికి చెందిన మర్రిపెల్లి వెంకటేశ్ ప్రతిభ కనబర్చాడు. ఫైనల్స్‌లో రాష్ట్ర జట్టు టోర్ని విన్నర్‌గా గెలుపొందడంలో ప్రతిభ కనబర్చి బ్రౌన్స్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

'భక్తితో కొలిస్తే దేవుడే సేవకుడవుతాడు'



మాట్లాడుతున్న సంత్ శేఖర్ మహారాజ్

గుడిహత్నూర్ : నిస్వార్థమైన భక్తితో దేవుడిని కొలిస్తే ఆ దేవుడే భక్తుడికి సేవకుడవుతాడని సంత్ శ్రీ శేఖర్ మహారాజ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గామాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేసి ఆయన మాట్లాడారు. సంతుల మార్గదర్శనంలో భక్తులు నడిస్తే దేవుడి కృపకు పాత్రులవుతారని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామారావ్ మహారాజ్‌లు సూచించిన మార్గం సమస్త జాతి అభివృద్ధికై వారు పాటుపడిన తీరు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎమ్మెల్యే బాపురావ్ కుమారుడు విశ్వజిత్, కార్యక్రమ అన్నదాత గిత్తే మదన్‌లను ఆయన సత్కరించి ఆశీర్వదించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, ఆలయ స్థలదాత స్థానిక సర్పంచ్ రాంజీ, లంబాడ సంఘ నాయకులు జాదవ్ రమేష్, పవార్ రవీందర్ పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పురుగుల మందుతాగి మహారాష్ట్రకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బో కర్ తాలుక కాసర్‌పేటతాండకు చెందిన పవర్ ర సూల్ (21) మద్యానికి బానిసయ్యాడు. గత కొన్ని నెలలుగా మద్యం తాగుతూ ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో బాధితుడి కుటుంబీకులు మందలించడంతో ఈ నెల 17న సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం బోకర్ ఆసుపత్రికి అక్కడి నుంచి నాందేడ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం తెల్లవారు జామున రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎలుగు పెద్ద ఆడేలు(51) గతంలో మద్యం మత్తులో కిందపడడంతో తలకు తీవ్రంగా గాయమైంది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. మద్యం మత్తులో శుక్రవారం గ్రామ సమీపంలోని నర్సారెడ్డి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ చెరువులో దూకి శుక్రవారం స్థానిక ప్రియదర్శి నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(50) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై పట్టణ సీఐ మల్లేశ్‌ను వివరణ కోరగా ఆ వ్యక్తికి గత కొన్ని రోజుల నుంచి మానసికస్థితి బాగలేదని, అందుకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు చూసి వెంటనే కాపాడారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ నష్ట పరిహారాన్ని ప్రకటించినట్లే, ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను సైతం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను జాతీయ విపత్తు సహాయ నిధి పథకం కింద ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని బాధిత రైతులకు ఎకరానికి 10,000 చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, అయితే మహారాష్ట్రలో పంట నష్టపోయిన రైతులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు పథకం కింద హెక్టారుకు రూ.13వేలు చెల్లించిందన్నారు. అదే విధంగా అక్కడి ప్రభుత్వం రుణాలు సకాలంలో చెల్లించినవారికి ఇన్సెంటివ్ సైతం అందజేసిందని వివరించారు. అయితే బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సరిగ్గా అమలు చేయకుండా నిధులను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఫలితంగా ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో 2018- 19, 20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫసల్ బీమా యోజన నష్టపరిహారం ప్రీమియం సైతం రైతులు న్యాయస్థానానికి వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం దిగి రాలేదని, జిల్లాలోని సుమారుగా 300 మంది రైతులకు పలు సాంకేతిక కారణాల ద్వారా నిధులు విడుదల కాలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులను సైతం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గండె విజయ్ కుమార్, శివయ్య, గన్నోజి విజయ్, సతీష్ రెడ్డి, తోకల నరేష్, కాంత, ముఖీం, ప్రశాంత్, జైపాల్, రవీందర్ ఉన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని సోనార్ గల్లికి చెందిన రాజేందర్ (35) అదృశ్యమైన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. భార్యాభర్తలకు జరిగిన చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన రాజేందర్ ఉదయం 10.30గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన రాజేందర్ తల్లి గంగమ్మ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- సినీ ఫక్కీలో ఛేదించిన పోలీసులు
- రూ.18లక్షల విలువైన 90 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో ముగ్గురు, ఇరువురి అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



గంజాయి స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. పోలీసుల వివరాల ప్రకారం... దిలావర్‌పూర్‌లోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ కారును నిలిపారు. అంతలోనే కారులోనుంచి రావూఫ్ అనే వ్యక్తి పారిపోయాడు. అనుమానం వచ్చిన పోలీసులు కారులోని షేక్ అరీఫ్, మహ్మద్ అన్వర్‌లను పోలీసులు ఆరా తీశారు. అయినా వారు ఏమి చెప్పకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును పరిశీలించారు. కారు డిక్కీ భాగంలో స్టెప్నీ ఉంచే ప్రదేశంలో మెటల్ షీట్‌తో వెల్డింగ్ చేయడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. గడ్డపారాతో మెటల్ షీట్‌ను తొలగించారు. అందులో 26 గంజాయి సీల్డ్ ప్యాకెట్లు లభించాయి. దీంతో తహసీల్దార్ కరీం సమక్షంలో పంచనామా నిర్వహించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన షేక్ ఆరీఫ్, మహ్మద్ అన్వర్‌లను పోలీసులు తమదైన తీరులో ప్రశ్నించగా అసలు విషయం తెలిపారు. షేక్ అరీఫ్, మహ్మద్ అన్వర్, రావూఫ్ ముగ్గురు స్నేహితులు. ఇందులో అరీఫ్, రావూఫ్ గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. త్వరగా డబ్బులు సంపాదించాలనే ఆశతో భద్రాచలం సరిహద్దు రాష్ట్రమైన ఒరిస్సా నుంచి గంజాయి తీసుకుని వచ్చే మహ్మద్ అబ్దుల్ అలీచాస్ కొకస్, అమ్రిత్ నుంచి రూ.18 లక్షలు విలువచేసే 90కేజీల గంజాయిని కిలోకు రూ.4వేల చొప్పున కొనుగోలు చేశారు. దానిని మహారాష్ట్రలోని నాందెడ్‌లో కిలోకు రూ.20వేలకు విక్రయించేందుకు కారులో బయలుదేరారు. హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లే క్రమంలో దిలావర్‌పూర్ టోల్ ప్లాజా వద్ద పోలీసులకు చిక్కారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

పెన్షనర్లకు ఆదాయపన్ను రద్దు చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగయ్య

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల ఆదాయపన్ను రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్లకు కోవిడ్–19 పేరుతో నిలిపివేసిన రైల్వే చార్జీల్లో రాయితీని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మూడోవ మహాసభలను స్థానిక పీఆర్టీయూ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నూతన పెన్షన్ విధానాన్ని దేశ వ్యాప్తంగా రద్దు చేయాలని, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హిమచల్ ప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలుకు నిర్ణయించాయని తెలిపారు. ఇటీవల ఢిల్లీలో 50 జాతీయ, రాష్ట్ర సంఘాలు పాత పెన్షన్ విధానం కోసం సమావేశమై దశలవారీ పోరాటాన్ని ప్రకటించాయని, అందులో తమ సంఘం కూడా భాగస్వామి అవుతుందని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం 12వ పీఆర్సీని సకాలంలో నియమించి నూతన వేతనాలు, పెన్షన్లు అమలు చేయాలని కోరారు. సిఫారసుల ప్రకారం డెత్ రిలీఫ్ కనీసం రూ.30 వేలు, 20 ఏళ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్ వంటి జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్, డీఏలు, ఉచిత వైద్యం, హైయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలన్నారు. కోల్ పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.15 వేలు ఇవ్వాలని, ఒకే ర్యాంక్ ఒకే పెన్షన్ విధానం అమలు చేయాలని, పెన్షన్, గ్రాట్యూటీ చెల్లింపుల్లో అధికారులకు, కార్మికులకు మధ్య వ్యత్యాసం తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శశికాంత్, జగన్‌మోహన్, దయాకర్‌రెడ్డి, బాపురావు, ఉమకాంత్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో వెలుగుచూస్తున్న అక్రమాలు

- అంగన్‌వాడీ హెల్పర్‌కు ఉపాధి కూలి చెల్లింపు



సామాజిక తనిఖీ గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

ఖానాపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీల్లో అవినీతి అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. మండలంలోని మేడంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో బీఆర్‌పీ పవన్ తనిఖీలో వెలుగుచూసిన పలు అక్రమాలను గ్రామస్తులకు సభలో చదివి వినిపించారు. గ్రామానికి చెందిన ఓ అంగన్‌వాడీ హెల్పర్‌తో పాటు పంచాయతీ కార్మికుడికి ఉపాధి హామీలో పని కల్పించడంతో పాటు కూలి డబ్బులు సైతం చెల్లించినట్లు తెలిపారు. గ్రామంలో జరిగిన 33 పనులకు పలు పనుల్లో ఇష్టారాజ్యంగా చెల్లింపులు చేసినట్లు వివరించారు. పలు మస్టర్‌లలో గ్రూప్ సభ్యుల సంతకాలు వేరే వారు చేశారని, ఇంకొన్ని మస్టర్‌లలో పలువురు కూలీల సంతకాల స్థానంలో వేలిముద్రలు ఉన్నాయన్నారు. గ్రామంలోని 70మంది కూలీలు 100 రోజులు పని దాటాక చేసిన పనులకు సంబంధించిన రూ.74వేలు పేమెంట్ కాలేదని, హరితవనంలో నాటిన 1600 మొక్కలు చనిపోయినట్లు గుర్తించామన్నారు. ఇంకొన్ని చోట్ల తక్కువ కొలతలకు ఎక్కువ కూలి చెల్లించారని నిర్ధారించినట్లు చెప్పారు.

ప్రతీ కూలికి ప్రశ్నించే తత్వం రావాలి..

ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కూలికి ప్రశ్నించే తత్వం వస్తేనే శ్రమకు తగిన ఫలితం రావడంతో పాటు అక్రమాలు తగ్గుతాయని ఎస్ఆర్‌పీ రాఘవ అన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో మాట్లాడారు. పని కోసం ప్రతి కూలీ దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుందని వివరించారు. తెల్లకాగితంపై కూడా దరఖాస్తు పెట్టొచ్చన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే అధికారులతో పాటు టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజునాయక్, కార్యదర్శి రంజిత్ ఉన్నారు.

ఒంటరి మహిళను మోసంచేసిన కానిస్టేబుల్

- పదిహేను రోజుల క్రితం అబార్షన్ చేయించిన వైనం
- పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నం
- ఆలస్యంగా వెలుగులోకి..
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ రాజేశ్వర్ ఓ ఒంటరి మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జవ్వాజి రాజేశ్వర్ కొంతకాలంగా ఖానాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. జగిత్యాల పట్టణానికి చెందిన ఓ వివాహిత భర్తకు విడాకులు ఇచ్చి ఒంటరిగా పట్టణంలో నివాసం ఉంటుంది. రాజేశ్వర్ సదరు మహిళను పెళ్లి చేసుకుంటానని కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళ గర్భం దాల్చింది. దీంతో 15 రోజుల క్రితం అబార్షన్ చేయించాడు. అప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో బాధితురాలు గురువారం తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. రాజేశ్వర్ నిరాకరించడంతో పట్టణంలోని విద్యానగర్‌లో ఉండే తన ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం నిర్మల్‌కు తరలించగా అక్కడి నుంచి జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి 11 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య

జనగామరూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేలమందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందుసేద్యం వసతి కల్పిస్తున్నారని, పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.